నమస్తే తెలంగాణ
సిద్దిపేట
13 హైదరాబాద్, సోమవారం 15 జనవరి 2024 SIDDIPET



సిద్ధివినాయక స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎంపీ బీబీపాటిల్ తదితరులు

# సిద్ధివినాయక పాహిమాం.. జయగణేశా రక్షమాం

- వైభవంగా రేజింతల్ సిద్ధివినాయక స్వామి జయంత్యోత్సవాలు
- మూడు రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు
- ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ప్రముఖులు
- నేడు స్వామివారి కల్యాణోత్సవం
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు



యాగశాలలో మహామంగళ హారతిని దర్శించుకుంటున్న భక్తులు

న్యాల్‌కల్, జనవరి 14: సంగారెడ్డి జిల్లాలోని రేజింతల్ సిద్ధివినాయక స్వామి 224వ జయంత్యోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కంచి కామకోటి పీఠం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. యాగశాలలో వందలాది మంది దంపతులతో వేదపండితులు యాగాలు నిర్వహించారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9గంటలకు సిద్ధి, బుద్ధి సమేత సిద్ధివినాయక స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్ రేజింతల్, ప్రధాన కార్యదర్శి అల్లాడి నర్సింలు కోరారు. నారాయణఖేడ్ మండలం బాణాపూర్‌కు చెందిన వామన్‌రావు మహారాజ్ ఆధ్వర్యంలో వందలాది మంది పాండురంగస్వామి భక్తులు పాదయాత్రగా ఆలయానికి వచ్చి పూజలు చేశారు. వారికి నారాయణఖేడ్, మనూర్, రాయికోడ్, న్యాల్‌కల్ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు స్వాగతం పలికారు.

**ఎమ్మెల్యే హరీశ్‌రావు పూజలు..**

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, సంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డీసీసీబీ చైర్మన్ శివకుమార్, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, నేతలు ఏర్పుల నరోత్తం, తన్వీర్ హైమద్ తదితరులు ఉత్సవాలకు హాజరయ్యారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం నేతలు ఆలయంలో పూజలు చేశారు. బర్ధిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి అవదూత గిరిమహారాజ్, సీడీసీ మాజీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్లు పెంటారెడ్డి, విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీ గౌసోద్దీన్, బీఆర్‌ఎస్ మండల నాయకులు పాండురంగారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గౌసోద్దీన్, సుధాకర్‌రెడ్డి, రఫీయొద్దీన్, చంద్రశేఖర్‌రెడ్డి, మహేశ్, హసన్, సర్పంచులు రవికుమార్, మల్లారెడ్డి, అమీర్, మారుతీయాదవ్, కుతుబుద్దీన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్ రేజింతల్, ప్రధాన కార్యదర్శి అల్లాడి నర్సింలు, ఉపాధ్యక్షులు నీల రాజేశ్వర్, బస్వరాజ్, సెక్రటరీ కల్వ చంద్రశేఖర్, చిద్రి లక్ష్మణ్, కమిటీ సభ్యులు కె.రవికుమార్, సుధాకర్ పాటిల్, బస్వరాజ్ సింధోల్, రాజ్‌కుమార్ అగర్వాల్, చంద్రశేఖర్, అశోక్, మేనేజర్ కృష్ణ, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

# యాసంగి పంటలకు నీళ్లివ్వండి

- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌కు ఫోన్‌లో విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సానుకూలంగా స్పందించిన నీటి పారుదల శాఖ మంత్రి
- రంగనాయకసాగర్‌లో ప్రస్తుతం 1.50 టీఎంసీల నీటినిల్వ
- మరో 1.50 టీఎంసీల నీటిని పంపింగ్ చేస్తే ఆయకట్టుకు భరోసా



సిద్దిపేట, జనవరి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌లోకి నీటిని పంపింగ్ చేసి యాసంగి పంటలకు అందించాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం హరీశ్‌రావు ఫోన్‌లో మంత్రి ఉత్తమ్‌కు సిద్దిపేట రైతుల పరిస్థితులను వివరించారు. నీటి లభ్యత ఉన్న మిడ్‌మానేరు లేదా అనంతగిరి రిజర్వాయర్ నుంచి 1.50 టీఎంసీల నీటిని వెంటనే పంపింగ్ చేయాలని కోరారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని హరీశ్‌రావు కలిసి రంగనాయకసాగర్‌లోకి నీటిని విడుదల చేయాలని లేఖ అందించారు. సుమారు 55వేల ఎకరాలకు నీళ్లు లేక రైతాంగం ఆందోళన చెందుతున్న విషయాన్ని మంత్రికి వివరించారు. మూడేండ్లుగా జిల్లా సాగు భూములకు రంగనాయక సాగర్ ద్వారా నీరు అందజేశామని, దీనివల్ల బంగారు పంటలు పండి రైతుల బతుకుల్లో సంతోషం నిండిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో యాసంగి పంటలకు సరిపోయే నీరు రిజర్వాయర్‌లో లేక రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. యాసంగి పంటలకు నీళ్లు అందించాలంటే 3టీఎంసీల నీరు ఉండాలని, కానీ.. ప్రస్తుతం రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లో 1.50 టీఎంసీల నీరు మాత్రమే ఉందన్నారు. రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని నీరివ్వాలని కోరారు. రంగనాయకసాగర్ కుడి, ఎడమ కాల్వలకు నీటిని లిఫ్ట్ చేసేలా అధికారులను తక్షణమే ఆదేశించాలని కోరారు. మల్లన్నసాగర్ ఆయకట్టు రైతులకు సైతం నీళ్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించి ఇరిగేషన్ అధికారులతో చర్చించి నీటి పంపింగ్‌కు ఆదేశాలిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు.

# పారిశుధ్య కార్మికులు సామాజిక వైద్యులు



అవార్డుతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, మున్సిపల్ కార్మికులు

- సిద్దిపేటకు అవార్డు వస్తే ప్రభుత్వం నుంచి స్పందన కరువు
- సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- మున్సిపల్ సఫాయి కార్మికుల సన్మానం

సిద్దిపేట, జనవరి 14 : క్లీన్ సిటీ ఆఫ్ తెలంగాణ అండ్ సౌత్ ఇండియా అవార్డు సిద్దిపేటకు రావడం మనందరికీ గర్వకారణమని, పారిశుధ్య కార్మికులే సామాజిక వైద్యులు అని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. దక్షిణాదిలో సిద్దిపేటకు క్లీన్‌సిటీ అవార్డు వచ్చినందుకు ఆదివారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈ అవార్డు సిద్దిపేట ప్రజలకు అంకితమన్నారు. ప్రజల భాగస్వామ్యం లేనిదే అనుకున్న లక్ష్యం సాధించలేమన్నారు.వైద్యులు రోగం వచ్చిన తర్వాత చికిత్స చేస్తే, పారిశుధ్య కార్మికులు రోగాలు రాకుండా కాపాడుతున్న సామాజిక వైద్యులు అని కొనియాడారు. ప్రజల ప్రాణాలు కాపాడుతున్న సఫాయి అన్నలకు సలాం అని, మున్సిపల్ అధికారులు, సిబ్బందికి చేతులెత్తి మొక్కుతున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రజలు చెత్తను బయట వేయరని, సిద్దిపేట ప్రజలు కూడా అలా ఉన్నతంగా ఆలోచించే స్థాయికి వెళ్లారన్నారు. సిద్దిపేట అంటే పందులు... చెత్త చెదారం... దుర్గంధం... దుర్వాసన... ఇది ఒకప్పటి సిద్దిపేట మాట. సిద్దిపేట ఇప్పుడు స్వచ్ఛత... పరిశుభ్రత... పచ్చదనం... సిద్దిపేట నేడు శుద్ధిపేటగా మారిందన్నారు. కేంద్రం ఏ అవార్డు ప్రకటించినా సిద్దిపేట పేరు ఉండడం గర్వంగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

**అవార్డులు వస్తే అభినందనలు తెలుపని పరిస్థితి ...**

దేశంలోనే పరిశుభ్రమైన పట్టణంగా సిద్దిపేట నిలిచిందని, సిద్దిపేట మున్సిపాలిటీకి జాతీయ అవార్డు ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి అభినందనలు తెలుపని పరిస్థితి ఉందని ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఎక్కడ అవార్డు వచ్చినా బీఆర్‌ఎస్ హయాంలో పిలిచి అభినందించే సం స్కృతి ఉండేదన్నారు. 2023లో దేశంలో 4416 మున్సిపాలిటీల్లో 9వ స్థానంలో హైదరాబాద్ నిలిస్తే, దక్షిణాది నుంచి సిద్దిపేట ఫస్ట్ నిలిచిందన్నారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం తరపున అభినందన ట్వీట్, ప్రెస్‌నోట్ కూడా నోచుకోలేని దుస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రశంసించకున్నా తమకు ప్రజల ఆశీస్సులు ఉన్నాయని ఆయన అన్నారు.



క్యూలైన్లో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

# ఏడుపాయల్లో భక్తుల రద్దీ

పాపన్నపేట, జనవరి 14 : మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గా భవానీమాత ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు మంజీరా నదిలోని పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి దుర్గామాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి, సిబ్బంది సూర్య శ్రీనివాస్,మధుసూదన్ రెడ్డి, రవివీర్ కుమార్, లక్ష్మీనారాయణ, ప్రతాప్‌రెడ్డి, తోట నరసింహులు, వరుణాచారి, రాజు, శ్రీకాంత్, సంతోష్, యాదగిరి ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకర శర్మ, పార్థీవ శర్మ, మురళీధర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపన్నపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి బందోబస్తు చర్యలు చేపట్టారు.

# పాత పంటలను కాపాడుకోవాలి

- చిరుధాన్యాలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలి
- డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ రుక్మిణీరావు
- జాడిమల్కాపూర్‌లో ప్రారంభమైన పాత పంటల జాతర
- హాజరైన వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు
- పలువురు మహిళా రైతులకు సన్మానం



పాత పంటల జాతరలో జ్యోతి వెలిగిస్తున్న డీడీఎస్ డైరెక్టర్ రుక్మిణిరావు



చిరుధాన్యాలు సాగు చేసిన మహిళా రైతును సన్మానిస్తున్న వినోద్ పావుల

జహీరాబాద్, జనవరి 14 : 'మన పంటలను మనం కాపాడుకోవాలి, అంతరించిపోతున్న విత్తనాలను నిల్వ చేసి వర్షాధారంగా సాగు చేయాలి.' అని డీడీఎస్ డైరెక్టర్ వి. రుక్మిణీరావు అన్నారు. ఆదివారం జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండలంలోని జాడిమల్కాపూర్ గ్రామంలో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ మహిళా సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాత పంటల జాతరను రుక్మిణీరావు జ్యోతి వెలిగించి ప్రారంభించి, చిరుధాన్యాలు సాగు చేసిన మహిళా రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాత పంటల జాతరను 24 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చిరుధాన్యాలకు గుర్తింపు తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశామన్నారు. పాత పంటలను కాపాడేందుకు ప్రతి ఒకరు ప్రయత్నించాలని, చిరుధాన్యాలకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. జీవవైవిధ్య పంటల్లో మంచి పోషకాలున్నాయని, ప్రతి ఒక్కరూ ఈ పంటలను సాగు చేయాలని సూచించారు. అధికారులు ప్రోత్సహించకపోయినా, రైతులంతా పాత పంటలు పండించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు సలోమి, మనిమయ్ సిన్హా, కంచన్ మాలిక్, అపర్ణ, వాసుకీ బేలవాడి, వినోద్ పావురాలతో పాటు ప్రజాప్రతినిధులు,అధికారులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

# పల్లె లోగిళ్లు.. పండుగ సందడి

పల్లెలు, పట్టణాలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. రెండు రోజులు సెలవులు రావడంతో ప్రజలు సొంతూళ్లకు పయనమయ్యారు. కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితుల రాకతో ఊరూ వాడల్లో సందడి నెలకొన్నది. పండుగ వేళ ప్రత్యేక పూజలతో ఆలయాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తున్నది. పతంగులు, బట్టలు, మిఠాయి, పూల దుకాణాలు కొనుగోళ్లతో కిటకిటలాడుతున్నాయి. ప్రతి ఇంటి ఎదుట తీర్చిదిద్దిన రంగురంగుల రంగవల్లులు కనువిందు చేస్తున్నాయి. పతంగులు ఎగువేస్తూ, డీజే పాటలకు డ్యాన్స్ చేస్తూ చిన్నా, పెద్దా కేరింతలు కొడుతున్నారు. వివిధ పిండివంటలు నోరూరిస్తున్నాయి. గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకుంటున్నాయి.

- ఉమ్మడి మెదక్ జిల్లానెట్‌వర్క్, (జనవరి 14)





సంక్రాంతి సందడి చేసేందుకు బసవన్న రాక..

# దుమ్ము రేపిన రంగారెడ్డి, నల్లగొండ జట్లు

- ముగిసిన 49వ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు
- బాలుర విభాగంలో విన్నర్ రంగారెడ్డి, రన్నర్ నల్లగొండ
- బాలికల విభాగంలో విన్నర్ నల్గొండ, రన్నర్ రంగారెడ్డి



ఫైనల్స్‌లో హోరాహోరీగా తలపడుతున్న రంగారెడ్డి, నల్లగొండ బాలుర జట్లు

గజ్వేల్ అర్బన్, జనవరి 14: గజ్వేల్ పట్టణంలో నాలుగు రోజులుగా సాగుతున్న 49వ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ క్రీడాపోటీలు ఆదివారం ముగిసాయి. ఈ పోటీల్లో 33 జిల్లాల నుంచి బాలుర, బాలికల జట్లు పాల్గొన్నాయి. జూనియర్ బాలికల విభాగంలో రంగారెడ్డి జిల్లా జట్టు 42 పాయింట్లు సాధించగా, నల్గొండ జట్టు 55 పాయింట్లు సాధించి 13 పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించింది. జూనియర్ బాలుర విభాగంలో నల్గొండ జట్టు 27 పాయింట్లు సాధించగా, రంగారెడ్డి 34 పాయింట్లతో విన్నర్‌గా నిలిచింది. ఫైనల్ కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగగా నిర్వాహకులు, అతిథులు, ప్రేక్షకులు ఎంతో ఉత్కంఠతతో వీక్షించారు. కాగా, విన్నర్, రన్నర్ జట్లకు మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ టీడీసీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, రాష్ట్ర ఒలింపిక్, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ దండుగుల రాజ్యలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్, ప్రధాన కార్యదర్శి శివకుమార్ తదితరులు ట్రోఫీలను అందజేశారు. క్రీడాపోటీల నిర్వహణకు కృషి చేసిన జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ను, ఏర్పాట్లకు సహకరించిన మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, పోలీసు, వైద్య, విద్యుత్ తదితర శాఖలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



జూనియర్ బాలికల విభాగంలో గెలుపొందిన నల్లగొండ జట్టును అభినందిస్తున్న మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, టీడీసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్